**జరిగిన కథ :** కన్యాకుబ్జ మహారాజు తాళ ధ్వజునికి ఇరవైమంది రాకుమారులు ఉన్నారు. వారంతా ఐదుగురు చొప్పున నాలుగు దిక్కులకూ దిగ్విజయ యాత్రలకు వెళ్లారు. ఇప్పుడు చివరి ఐదుగురైన.. పుష్పకేతుడు, మయూరధ్వజుడు, చిత్రభానుడు, సౌమ్యుడు, పింగళుల వంతు వచ్చింది. ఈ ఐదుగురూ దక్షిణ దిగ్విజయ యాత్ర చేస్తున్నారు..

కాశీ మజిలీ కథలు 82



# నాగర సర్వస్వం

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

పుష్పకేతుడు, అతని నలుగురు సోదరులూ... దక్షిణ దిగ్విజయయాత్రలో భాగంగా ఆంధ్ర, కర్ణాటక, కేరళ దేశాలలోని విశేషాలను చూశారు. కాంచీ క్షేత్రాన్ని సేవించి, పాండ్యదేశం మీదుగా స్త్రీరాజ్యాన్ని చేరుకున్నారు.

స్త్రీరాజ్యానికి రాజధాని పుష్పపురం. పది ఆమడల వెడల్పు, పదహారు ఆమడల పొడవు కలిగి.. విశాలమైన వీధులతోనూ, సౌధాలతోనూ కూడుకున్న మహానగరమది. రత్నమకుట అనే మహారాణి ఆ రాజ్యాన్ని పాలిస్తున్నది. రాజపుత్రులు ఐదుగురూ ఆ నగరంలో ఒక భవనాన్ని అద్దెకు తీసుకున్నారు.

''తమ్ములారా! ఈ నగరం స్త్రీ ఏలుబడిలో ఉన్నది. ఆమెతో యుద్ధం పనికిరాదు. కనుక కొంతకాలం ఇక్కడే ఉండి, ఇక్కడి వింతలు చూసి.. మన దారిన పోదాం'' అన్నాడు పుష్పకేతుడు.

''ఇంత పెద్దనగరాన్ని మనం ఇంతవరకు చూడలేదు. ఇందులో ఎన్నో విచిత్రాలు ఉండకపోవు. మనం తలో దిక్కుకూ పోయి చూసి వద్దాం'' అని సలహా చెప్పాడు మయూరధ్వజుడు.

అప్పటినుంచి ఐదుగురూ ప్రతిరోజూ చక్కగా అలంకరించుకుని.. శృంగారశేఖరుల్లా తలో వీధికి పోయి, విశేషాలు చూసి వచ్చేవారు. రాత్రికి బసలో కలుసుకుని, తాము చూసిన విశేషాలను కలబోసుకునేవారు. ఆవిధంగా మూడురోజులు గడిచాయి.

నాలుగోరోజున పుష్పకేతుడు మాత్రమే తిరిగి వచ్చాడు. మిగతావారు రాలేదు. చీకటి పడింది. పుష్పకేతుడు తమ్ముళ్ల కోసం పరితపిస్తూ వీధిలోనే కూర్చున్నాడు. కానీ, రాత్రంతా ఒక్కరూ రాలేదు.

అంతకుముందు రోజు జరిగిన సంభాషణల గురించి ఆలోచిస్తూ..

'నిన్నరాత్రి మాటల మధ్యలో ఇక్కడి వేశ్యావాటిక చాలా పెద్దదని, స్త్రీలు మంచి నీటుకత్తెలని పింగళుడు చెప్పాడు. బహుశా ఈవేళ అక్కడికే పోయి ఉండొచ్చు. అయ్యో! అక్కడికి పోవద్దని చెప్పాల్సింది. ఏ మాయలాడి మావాణ్ని మోసపుచ్చి లోబరుచుకుందో.. రేపు వెళ్లి తేల్చుకుంటాను' అనుకున్నాడు.

మరునాడు చక్కగా అలంకరించుకుని, చేత బెత్తం పట్టుకుని వేశ్యావాటికలో ప్రవేశించాడు. అప్పటికింకా సాయంకాలమైనా కాలేదు. ఆ ఇళ్లలోంచి అప్పటికే సంగీతవాద్యాలు వినవస్తున్నాయి. ఆ సంగీతాన్ని వింటూ.. ఆ వీధిలో అన్నిటికంటే ఎత్తయిన అరుగులతో, విచిత్రమైన గోడలతో, ఆకాశాన్నంటే పైకప్పుతో, లతలతో కూర్చిన విశాలమైన సింహద్వారం కలిగి.. రాజప్రాసాదాన్ని తలపిస్తున్న ఒక భవంతిని చూసి ఆశ్చర్యపోయాడు పుష్పకేతుడు.

ద్వారపాలకుని వద్దకు వెళ్లి..

''ఈ మేడ ఎవ్వరిది?'' అని ప్రశ్నించాడు.

''అయ్యా! ఆ గోడకు వేలగట్టిన పటాన్ని చదువుకోండి'' అని ఆ ద్వారపాలకుడు సమాధానం ఇచ్చాడు.

పుష్పకేతుడు అరుగెక్కి, అక్కడ వేలాడదీసిన పటంలోని విషయాలను చదవసాగాడు..

ఈ భవంతిలో మహారాజరత్నం అనే పేరు కలిగిన వేశ్యారత్నం కాపురం చేస్తున్నది. దీనికి ఎదురుగా ఉన్న చిత్రపటం ఆమెదే! ఆ త్రిభువనైక సుందరికి అరవైనాలుగు కళల్లోనూ సమానమైన పాండిత్యం ఉంది. ఆమె తుచ్ఛులైన విటులను చేరదు; ప్రచండమైన విద్యామదం కలవారిని మాత్రమే వరించగలదు. విద్యావిషయంగా ఆమె వేసే ప్రశ్నలకు సరైన సమాధానం ఇచ్చిన వారు ఆమెను చేపట్టవచ్చు. తతిమ్మావారంతా ఆమె తోటలో పని చేయాల్సి ఉంటుంది. ఇందుకు అంగీకరించిన వారు మాత్రమే ఒడంబడిక పత్రాలపై సంతకాలు చేసి లోపలికి రావాల్సి ఉంటుంది.

..అని రాసి ఉన్న పటానికి ఎదురుగా వేలాడదీసిన మహారాజరత్నం చిత్రాన్ని కూడా ఓసారి పరిశీలించాడు పుష్పకేతుడు. నిశ్చయంగా ముల్లోకాలలోనూ ఈమె లాంటి సుందరి ఉండబోదు అనిపించింది.

కొద్దిసేపు ఆలోచించిన తర్వాత ద్వారపాలకుని వద్దకు వెళ్లి..

''ఓయీ! నిన్న ఎవరైనా ఈమె ప్రశ్నలకు సమాధానం ఇస్తామని వచ్చారా?'' అని ప్రశ్నించాడు.

అందుకు వాడు..

''అవును స్వామీ! నిన్న ఒక చిన్నవాడు.. అచ్చంగా మీలాగే ఉన్నాడు. లోపలికి వెళ్లినవాడు తిరిగి రాలేదు. బహుశా ఈపాటికి తోటలో మొక్కలకు పాదులు తవ్వుకుంటూ ఉండి ఉంటాడు'' అని విచారంగా చెప్పాడు.

'ఆహా! ఈమె విద్యలలో ఎంత ప్రౌఢ కాకపోతే మా పింగళుడినే ఓడించగలదు! వాణ్ని తిరిగి తెచ్చుకోవాలంటే ఈమెను గెలవడం ఒక్కటే ఉపాయం. కాకపోతే ఆమె ఏ విద్యలలో ప్రశ్నిస్తున్నదో ముందుగా తెలుసుకుని కానీ, లోనికి పోరాదు' అని మనసులో తలపోశాడు పుష్పకేతుడు.